

వార్డ్ అండ్ డీడ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మల్‌రెడ్డి రాంరెడ్డి, గజ్జి భాస్కర్ యాదవ్

కళాశాల సేవలు అభినందనీయం

రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడంలో వార్డ్ అండ్ డీడ్ కళాశాల ముందంజలో ఉందని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానికంగా ఉన్న ఈ కళాశాలలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. 25 సంవత్సరాల క్రితం కట్ట థామస్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకొని ఉన్న ఉద్యోగాలలో స్థిర పడ్డారని తెలిపారు. వార్డ్ అండ్ డీడ్ ఏర్పాటు చేసి లెప్రసీ బాధితులను అక్కున చేర్చుకుని చికిత్సలు అందించారన్నారు. శాంతినగర్, పసుమాముల ప్రాంతాలలో పేదలకు ఉచితంగా ఇళ్లు కట్టించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సీఈవో థామస్, బోర్డు సభ్యులు ఇజ్రాయిల్, సీఎఫ్‌ఓ స్వరూప్‌కుమార్, ప్రిన్సిపాల్ సునిత వినయ్, అధ్యాపకుడు వెంకటరమణారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ చారి, హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్ గౌడ్, నాయకులు సిద్దంకి కృష్ణారెడ్డి, గజ్జి శ్రీనివాస్‌యాదవ్, సత్తిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటు భూమిపూజలో సామ రంగారెడ్డి, పేరాల శేఖర్‌రావు

వాజ్‌పేయి సేవలు ఎనలేనివి

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశ, స్థితిగతుల్లో మార్పు తెచ్చి భారత్ ప్రగతి సాధించడంలో మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి కీలక భూమిక పోషించారని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, పేరాల శేఖర్‌రావులు పేర్కొన్నారు. ఆదివారం సీనియర్ నాయకుడు గుమ్మకొండ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ మహనీయుల విగ్రహాల వద్ద వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ఇష్టపడే నాయకుడు వాజ్‌పేయి అని, ఎల్బీనగర్‌లో అలాంటి గొప్ప నాయకుడి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని సామ రంగారెడ్డి, పేరాల శేఖర్‌రావులు అన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం, కొత్తపేట డివిజన్ల కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, వివిధ డివిజన్ల అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, దాసరి జయప్రకాశ్, బీజేపీ నాయకులు మొరిపెట్టి సంతోష్‌కుమార్, నాంపల్లి రామేశ్వర్, విజయశ్రీ, కవితా రెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్వేరోస్ గుండోజు రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రష్ కేర్ ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కందికంటి విజయ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, ఆర్థో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కందికంటి బిక్షపతి, ఐలయ్య యాదవ్, యాదయ్య యాదవ్, ప్రకాశ్‌గౌడ్, లక్ష్మణ్, ప్రశాంత్‌గౌడ్, జగన్, కృష్ణ, నరేష్, మధు, బస్వరాజ్, శివ, లక్ష్మణ్, పృథ్వీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముందు రిజర్వేషన్లు.. తర్వాతే ఎన్నికలు

● బీసీ జన చైతన్య వేదిక డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలను నిర్వహించాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు దాసరి అజయ్‌కుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని ఆదివారం డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం అని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ నాటకాలాడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మూడవ శాఖ ప్రారంభం



తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న చిన్న జీయర్‌స్వామి

సంతోష్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లో తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మూడవ శాఖ ఆదివారం ప్రారంభమైంది. స్థానిక వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న తిరుమల శ్రీనిధి బిల్డింగ్ మొదటి అంతస్తులో ఈ శాఖను త్రిదండి శ్రీరామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రారంభించారు. వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. వ్యాపారస్తులు మధ్యతరగతి, గృహస్తులకు సేవలు అందించాలన్నారు. తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. తెలంగాణ హైకోర్టు జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, ఐఎఫ్ఎస్ రిటైర్డ్ అధికారి మల్లికార్జునరావు, బ్యాంక్ మేనేజర్ వామదేవ్, కాలనీ సంక్షేమసభ్యులు పాటి నారాయణరెడ్డి, నర్సింగ్‌రావు, పీఎల్ కృష్ణ, వెంటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు నల్లదీగ శ్రీనివాసాచార్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు నిధులివ్వండి

● జలమండలి ఎండీకి వినతి



జలమండలి ఎండీతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కాలనీలలో కొత్తగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి విన్నవించారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. హయత్‌నగర్ డివిజన్ శివారులో ఉండటం వల్ల అనేక కాలనీలకు నేటికీ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేదని తెలిపారు. దీంతో రోడ్ల వెంట మురుగు పారుతుందని తెలిపారు. ఆయా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎండీకి తెలిపారు. డివిజన్‌లో 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ట్రంకు లైన్‌ను మార్చి కొత్త లైన్ వేయాలన్నారు. ఇప్పటికే అనేక చోట్ల మ్యాన్‌హోల్స్ కుంగిపోతున్నాయన్నారు.

అడుగేయండి చూద్దాం!

నెలరోజులుగా మురుగులోనే కళానగర్ కాలనీ

● దుర్వాసన, దోమల బెడద తీవ్రం

● ఇబ్బందుల్లో స్థానికులు

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు



డ్రైనేజీ మురుగుతో ఉన్న రోడ్డు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒక్క రోజు రోడ్డంతా బురదగా ఉంటే ఎవరైనా సరే అల్లాడిపోతుంటారు.. మరి నెల రోజులుగా ఇదే విధంగా ఉంటే ఆ బాధ వర్ణనాతీతం. ఇదే పరిస్థితి నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని కళానగర్ కాలనీలో ఉంది. ఈ సమస్య పరిష్కారానికి నోచడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచెత్తిన డ్రైనేజీ..

మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పసుమాముల కళానగర్ కాలనీలో నెల రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. ఎటు చూసినా కాలనీలోని రోడ్డులు డ్రైనేజీ మురుగు నీటితో నిండిపోయాయి. కాలనీ ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టలేని దుస్థితి. పాలు, కూరగాయాలు, పిల్లలను స్కూల్‌కు పంపించాలంటే మురుగులో నుంచే నడుచుకుంటూ వెళ్తున్నారు. తీవ్రమైన దుర్వాసన, దోమలబెడద ఎక్కువైంది. కనీసం మున్సిపల్ అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని స్థానిక కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కాలనీ కావడంతోనే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కారణం ఇదే..

కాలనీ సమీపంలో పోచమ్మ చెరువు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇది పూర్తిగా నిండింది. పై కాలనీల నుంచి నేటికీ మురుగు చేరుతోంది. కాలనీకి డ్రైనేజీ ఔట్‌లైన్ లేకపోవడంతో భూగర్భ పైప్‌లైన్‌ను చెరువ వరకు వేసి వదిలేశారు. భారీగా వరద నీరు రాగా.. బ్యాక్ వాటర్ డ్రైనేజీ పైప్ లైన్ నిండి మ్యాన్‌హోల్‌లు పొంగిపొర్లి మురుగు కాలనీ రోడ్లను ముంచెత్తుతోంది. చెరువు అలుగును మూసి వేయడంతోనే వాటర్ వెనక్కి వస్తుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అలుగు ఎత్తు తగ్గిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.



రోడ్డుపై పారుతున్న మురుగు



ఇళ్ల ఎదుట నిలిచిన మురుగు

అడుగులోతు మురుగు



నెల రోజులుగా ఇంటి ఎదుట అడుగులోతు మురుగు నిలిచింది. అందులో నుంచే రాకపోకలు సాగిస్తున్నాం. దుర్వాసన, దోమల బెడదను భరించలేకపోతున్నాం. మున్సిపల్ అధికారులు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- విజయలక్ష్మి, కాలనీ మహిళ

పిల్లలకు జ్వరాలు



ఇంటి చుట్టూ మురుగు నీరు దీంతో అందరికీ జ్వరాలు వస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు తట్టుకోలేక పోతున్నారు. వాసనతో అన్నం కూడా తినడం లేదు. విషజ్వరాలతో ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నాం.

- రాధిక, స్థానిక మహిళ

సబ్‌స్టేషన్, పార్క్, ఠాణాలకు స్థలం కేటాయించాలి

● ఆస్తి పన్ను అవకతవకలపైనా విచారణ చేపట్టండి

● మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో ప్రభుత్వ ఆస్పత్రి నూతనంగా నిర్మిస్తున్నారని, చైతన్యపురి ఠాణా విస్తరణ, విద్యుత్ సబ్‌స్టేషన్, పార్కుకు కూడా ఇక్కడి స్థలాన్నే కేటాయించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణంతో పాటు అందులోనే కొంత స్థలం కేటాయించి చైతన్యపురి ఠాణా విస్తరణ, విద్యుత్ సబ్‌స్టేషన్, పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. నేటికీ కూడా స్థలం కేటాయించట్లేదన్నారు. జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను వసూళ్ల అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి ప్రజలకు న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయమై రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఠాణా విస్తరణ, పార్కు, విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలం కేటాయింపు విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించడంతో పాటు ఆస్తిపన్ను విషయంలో న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్లు విఠల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, బీఆర్ఎస్ యువ నాయకుడు రఘువీర్ రెడ్డి, నాగలక్ష్మి, యాదగిరిముదిరాజ్, జయశ్రీ, గట్టు శ్రీను, రమణా రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్‌చారి తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు

చాదర్‌ఘాట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితీ దిల్‌సుఖ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విచ్చేసి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిరాం సంకీర్తనలో పాల్గొన్నారు. మానవాళి కోసం సత్యసాయి బాబా చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. అంతకు ముందు కమిటీ ప్రతినిధులు బూర్గు కృష్ణ, వీవీ రామారావు, శ్రీనివాస్‌తో కూడిన బృందం సభ్యులు హోమం నిర్వహించారు.

ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థినికి చెక్కుఅందజేస్తున్న నాగేంద్రరావు, కృష్ణప్రసాద్, సభ్యులు

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పలు పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి సీటు సంపాదించిన పది మంది విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీ కమ్మ సేవా సంఘం దిల్‌సుఖ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో సంఘం భవనంలో కార్యక్రమం నిర్వహించారు. కమ్మ సేవా సంఘం కులస్తుల అభ్యున్నతితో పాటు ప్రతిభ చాటుతున్న పేద విద్యార్థులు, ఇతర సేవా కార్యక్రమాలను సంఘం చేపడుతుందని దిల్‌సుఖ్‌నగర్ కమిటీ అధ్యక్షుడు కొల్లి నాగేంద్రరావు, ప్రధానకార్యదర్శి ఎన్వీ కృష్ణప్రసాద్‌లు అన్నారు. పది మంది విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.8.40లక్షలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం దిల్‌సుఖ్‌నగర్ కమిటీ ప్రధానకార్యదర్శి మహారాజ్ చౌదరి, సభ్యులు లక్ష్మీదుర్గ, రాధాకృష్ణమూర్తి, పూర్ణిమ, శ్రీనివాసరావు, శరత్‌బాబు, సీతారామయ్య, విశ్వేశ్వరయ్య, నరసింహారావు, హరిబాబు, సుబ్బారావు, విజయ్, ప్రసాద్, మాల్యాద్రి, మోహన్‌రావు, శ్రీనివాసమూర్తి, బ్రహ్మాజీ, వడ్లమూడి శ్రీను, నవీన్‌చౌదరి, హరికృష్ణ, శ్రీను ఉన్నారు.

'కాలనీ అభివృద్ధికి కృషి చేయండి'

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఉన్న సత్యనగర్ జనప్రియ కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆయన్ను తన కార్యాలయంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధానకార్యదర్శి కృష్ణకిశోర్‌ల ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పవన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను అభినందించారు. కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రసాద్‌శర్మ, బాలరాజు, ట్రెజరర్ ఉదయభాస్కర్ ఉన్నారు.



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సాహె

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్

సంతోష్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సాహె తెలిపారు. అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ హైదరాబాద్ వృద్ధుల సమితి ఆధ్వర్యంలో సైదాబాద్ కమ్యూనిటీ మసీదులో వృద్ధుల శాఖ అధ్యక్షుడు జియా ఉద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీఒక్కరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రి ఆర్ఎమ్ఓ డాక్టర్ సిద్ధిఖీ, డాక్టర్ లావణ్య, డాక్టర్ బిర్జీస్ ఉన్నీస్సా, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సభ్యులు మౌల్వీ హమీదుల్లా హసన్, మీర్జా ఉద్దీన్, తన్వీర్ అహ్మద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణకు పార్కులు దోహదం

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాకింగ్, వ్యాయామాలు చేసుకునేలా ఆహ్లాద వాతావరణాన్ని పంచుతున్న పార్కులు ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఎంతగానో దోహదపడుతున్నాయని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజీగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని జానకీ ఎన్‌క్లేవ్ పార్కు పునర్నిర్మాణం, సుందరీకరణ పనులు పూర్తి కాగా ఆదివారం కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పార్కును పునఃప్రారంభించారు. జానకీ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.జీవన్, ఉపాధ్యక్షుడు కె.వెంకటయ్య, ప్రధానకార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, కోశాధికారి జె.శ్రీనివాసులు, ఎం.రాంరెడ్డి, వాయునందన్ పాల్గొన్నారు.

యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీది కీలకపాత్ర

● మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా

అల్వాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్రను పోషిస్తోందని మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా అన్నారు. ఎన్‌సీసీ ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం మెహిదీపట్నం గారిసన్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీసీ 78వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా చేత పట్టుకుని గుర్రపు స్వారీ చేస్తూ అతిథులకు స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన మిశ్రా ప్రసంగించారు. క్యాడెట్స్‌ల ఐక్యత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పాటు ధైర్యం, దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమోడోర్ నర్సింగ్ సైలానీ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. తొలుత క్యాడెట్స్‌లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ లబ్ధిని అందిపుచ్చుకోండి

● కేవైసీ అప్‌డేట్ కాని రేషన్‌కార్డులు 27,079

● ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకునేందుకు అనాసక్తి

● ఈపోస్ మిషన్‌లో వేలి ముద్రలు పడకపోవడం ఓ కారణం

● డిసెంబర్ వరకు చాన్స్



పౌరసరఫరాల విభాగం ఒకటో సర్కిల్ కార్యాలయం

చాదర్‌ఘాట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యయప్రయాసల నడుమ రేషన్‌కార్డు పొంది ఉంటారు. కేవైసీ వద్ద కొంత ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గకూడదు. ఒకవేళ సర్దుకుపోతే ప్రభుత్వ లబ్ధి దూరం కావాల్సి వస్తుంది. డిసెంబర్ లోపు అయినా కేవైసీ చేసుకుంటే ఉత్తమం అని అధికారులు చెబుతున్నారు. కాగా, పౌరసరఫరాల విభాగం ఒకటో సర్కిల్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల జారీకి ముందు 68,868 రేషన్ కార్డులున్నాయి. కొత్తగా జారీ అయిన వీటితో కలిపి ఈ సంఖ్య 84,621కి పెరిగింది.

వారికి రేషన్ జారీ

రేషన్ షాపుల్లో ఉచిత బియ్యంతో పాటు గోదుమలు, చక్కెర వంటి నిత్యావసర సరుకులను కొనుగోలు చేసేందుకు రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలి. రేషన్‌కార్డులో కుటుంబీకుల ఎంత మంది పేర్లు ఉంటే అంత మంది తప్పనిసరిగా రేషన్ తీసుకోడానికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఈపోస్ మిషన్‌లో వేలి ముద్ర వేయాలి. ఇలా వేసిన తర్వాతే రేషన్ సరుకులు జారీ చేస్తున్నారు. మొదట్లో కుటుంబీకులందరూ తప్పనిసరిగా రేషన్ షాపులకు నెలవారీగా వచ్చేందుకు అలవాటుపడ్డారు. గడచిన ఆరు మాసాల నుంచి కార్డుదారుల్లో చాలా మంది రేషన్ సరుకులు తీసుకునేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో పాటు ఈపోస్ మిషన్‌లో వేలి ముద్రలు కూడా నమోదు కావడం లేదు. కొత్తగా రేషన్ కార్డులు జారీ అయిన వారిలో ఎక్కువ మంది ఇలా వేలి ముద్రలు వేయని కారణంగానే కేవైసీ అప్ డేట్ కావడం లేదని రికార్డులు స్పష్టం చేస్తున్నారు.

కేవైసీ చేయించుకోని కార్డుదారులు

పౌరసరఫరాల విభాగం ఒకటో సర్కిల్ పరిధిలో 84,621 రేషన్ కార్డులుండగా వీటిలో కేవలం 68 శాతం 57,542 మంది కార్డుదారులకు మాత్రమే కేవైసీ అప్‌డేట్ అయ్యిందని అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మిగతా 32 శాతం.. 27,079 మంది రేషన్‌కార్డులకు కేవైసీ అప్‌డేట్ కాలేదని కూడా తెలియజేస్తున్నాయి. గడచిన మూడు, నాలుగు నెలలుగా కేవైసీ అప్‌డేట్ చేసుకోవడం లేదని స్పష్టం చేస్తున్నాయి. కేవైసీ అప్‌డేట్ చేయించుకుంటేనే రేషన్ సరుకులు తీసుకోవడానికి అర్హులని రేషనింగ్ అధికారులు ప్రకటిస్తున్నా కొంత మంది కార్డుదారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈనెల 18వ తేదీ లోపు కేవైసీ అప్‌డెట్ చేయించుకోవాలన్నారు. లేకుంటే వచ్చేనెల డిసెంబరులో రేషన్ కార్డులను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. అయినా కార్డుదారుల నుంచి మాత్రం కేవైసీ చేయించుకునేందుకు ముందుకు రాలేదు.

వేలిముద్ర వేస్తే చాలు

ఇప్పటికైనా కేవైసీ చేయించుకోని రేషన్‌కార్డుదారులు వచ్చేనెల డిసెంబరు 1 నుంచి జారీ చేసే రేషన్ సరుకులను తీసుకుందుకు వచ్చినప్పుడు తప్పనిసరిగా ఈపోస్ మిషన్‌లో వేలి ముద్ర వేయాలి. ఒక వేళ రేషన్‌షాపుల వద్ద రద్దీ దృష్ట్యా నేరుగా మలక్‌పేటలోని రేషనింగ్ కార్యాలయానికి రావాలని సూచిస్తున్నాం. షాపు వేళలు ముగిసిన తర్వాత కేవైసీ అప్‌డేట్ చేయించాలని కూడా ఆదేశాలు జారీ చేస్తున్నాం. ఈ క్రమంలో కార్డుదారుల పట్ల డీలర్లు దురుసుగా ప్రవర్తించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఫిర్యాదు చేయొచ్చు.

- నర్సింగ్‌రాజ్, సహాయ రేషనింగ్ సరఫరా అధికారి, మలక్‌పేట సర్కిల్-1, పౌరసరఫరాల విభాగం